క్లుప్తంగా

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: టమాటా రూ.19, నల్ల వంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 50, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 45, పందిరిబీర 50, క్యాబేజీ 11, క్యారెట్ 23, దొండ 40, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 60, గోకరకాయ 45, కీర 28, దోసకాయ 40, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 26, సొరకాయ 15, పొట్లకాయ 13, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు ఉంటాయి.

21న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

సనత్‌నగర్: సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కారానికి కన్స్యూమర్ గ్రీవెన్సెస్ సమావేశాన్ని ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు సనత్‌నగర్ ఏడీఈ అమర్‌నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. సనత్‌నగర్‌లోని ఆల్విన్ సబ్‌స్టేషన్ ఆవరణలో జరిగే ఈ సమావేశంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ వినియోగదారుల నుంచి సమస్యలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలతో పాటు బిల్లుల్లో హెచ్చుతగ్గులు విషయాలపై ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చన్నారు.

నేడు పీహెచ్‌డీ ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ఫలితాలు నేడు (19న) విడుదల చేయనున్నట్లు పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డి బుధవారం తెలిపారు. గత నెల 1, 2, 3 తేదీలలో 47 సబ్జెక్టులకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలకు 6656 మంది హాజరయ్యారని నేడు సాయంత్రం 4 గంటలకు వీసీ ప్రొ.రవీందర్ తన కార్యాలయంలోని ఈసీ హాల్లో ఫలితాలను విడుదల చేస్తారన్నారు. ర్యాంక్ కార్డులను ప్రత్యేకంగా జారీ చేయబోమని ఇంటర్నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

ఆభరణాల తయారీ దుకాణంలో బాలుడి ఆత్మహత్య

రాంగోపాల్‌పేట్: బంగారు ఆభరణాలు తయారు చేసే దుకాణంలో పనిచేస్తున్న ఓ బాలుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన అలీ హుస్సేన్ మెదక్‌తో పాటు రంగ్రేజీ బజార్‌లో బంగారు ఆభరణాలు తయారు చేసే దుకాణాలను నిర్వహిస్తున్నాడు. ఆరు నెలల క్రితం వెస్ట్ బెంగాల్ హుగ్లీకి చెందిన కాశీనాథ్ కుమారుడు సుబ్రత సంత్ర (17)ను బంగారు దుకాణంలో పనిచేసేందుకు రప్పించారు. కండోజీబజార్‌లో మరో ఐదు మందితో కలిసి ఇతన్ని అక్కడే బస, పని చేసే ఏర్పాట్లు చేశారు. వీరందరు ఇక్కడే పనిచేస్తూ అదే గదిలో నివసిస్తుంటారు. మంగళవారం సుబ్రత సంత్ర బాత్రూమ్‌కు వెళ్లి ఎంతకు బయటకు రాలేదు. అనుమానం వచ్చిన తోటివారు తలుపులు తెరిచి చూడగా తాడుతో బాత్రూమ్‌లో ఉరివేసుకుని కనిపించాడు. పోలీసులకు సమాచారమిచ్చి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం..

వెస్ట్ బెంగాల్‌కు చెందిన కొంత మంది వ్యాపారులు అక్కడి నుంచే కొద్దిపాటు డబ్బులు చెల్లించి చిన్న పిల్లలను తీసుకుని వచ్చి బానిసలుగా మారుస్తున్నారని వీరిపై మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేస్తామని జన తెలంగాణ రైట్ సొసైటీ ఉపాధ్యక్షులు నర్సింగం సతీష్ తెలిపారు. వేలాది మంది పిల్లలు, యువతను ఇరుకైన గదుల్లో ఉంచి తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు పనులు చేయిస్తున్నారని ఆయన ఆరోపించాడు. వేలాది మంది చిన్నారులు ఇలాగే మగ్గిపోతున్నారని కార్మిక శాఖ, జీహెచ్‌ఎంసీ, పోలీసులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాలోత్సవానికి ప్రోత్సాహం అందిస్తాం



హిమాయత్‌నగర్: ఈ ఏడాది బాలోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తమవంతు ప్రోత్సాహం అందిస్తామని కోవిద సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ జి.అనూహ్యారెడ్డి తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని ఎస్వీకేలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించే ఉత్సవాల్లో అతిథిగా పాల్గొనాలని నిర్వాహకులు ఆమెను బుధవారం కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనూహ్యారెడ్డి మాట్లాడుతూ..పిల్లలకు నచ్చేలా, వారు మెచ్చేలా బాలోత్సవం జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఉత్సవాల్లో పిల్లలకు ఉపయోగపడే, వారికి జీవితాంతం గుర్తుండిపోయే కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. తమ ఫౌండేషన్ నుంచి ఈ కార్యక్రమానికి పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తామని అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ఎన్.సోమయ్య, జి.బుచ్చిరెడ్డి, చినుకు పీఎస్ మూర్తిలకు అనూహ్యారెడ్డి తెలిపారు.

దహన సంస్కారాలకు దారేది!

- అభివృద్ధికి నోచుకోని సత్యహరిశ్చంద్ర శ్మశాన వాటిక
- చెట్లు, పిచ్చి మొక్కలతో అడవిని తలపిస్తున్న వైనం
- కమిటీ సమన్వయ లోపమంటున్న స్థానికులు
- దృష్టి సారించని అధికారులు, ప్రజాప్రతినిధులు



శ్మశాన వాటికలో పెరిగిన దట్టమైన చెట్లు, పిచ్చి మొక్కలు

అడ్డగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్షల్లో ఖర్చుచేసి శ్మశాన వాటికలను వైకుంఠధామంగా తీర్చిదిద్దుతున్నా కొన్ని ప్రాంతాల్లోని శ్మశాన వాటికలు చిట్టడివిని తలపిస్తున్నాయి. శాంతినగర్‌లోని సత్యహరిశ్చంద్ర శ్మశాన వాటిక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. నూతన కమిటీ ఏర్పాటైనప్పటి నుంచి శ్మశానవాటిక పరిస్థితి మరీ అధ్వానంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అన్ని శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు మంజూరవుతున్నా సత్యహరిశ్చంద్ర శ్మశాన వాటికపై ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనులు చేపడుతారనుకుంటే సంబంధిత అధికారులు దృష్టి సారించని కారణంగా అవి కేవలం మాటలకే పరిమితమయ్యాయి. దీంతో కమిటీ సభ్యులు సైతం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పిచ్చి మొక్కలతో నిండి..

- దట్టమైన చెట్లు, పిచ్చి మొక్కలు పెరగడంతో శ్మశాన వాటిక అడవిని తలపిస్తుందని స్థానికులు చెబుతున్నారు. పొదలు, పిచ్చి మొక్కలు పెరగడంతో అందులో పాములు సంచరిస్తున్నాయని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. వివిధ రకాల పిచ్చి మొక్కలు పెరగడంతో దహన సంస్కారాలకు వచ్చే వారికి దారి లేకుండా పోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కలను తొలగించి, పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి శుభ్రపర్చాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో సత్యహరిశ్చంద్ర హిందూ శ్మశాన వాటిక కొంత అభివృద్ధి చెందింది. ఆర్చి, నల్లా కనెక్షన్లు, ఆఫీస్ రూం, సీసీ కెమెరాలు, డ్రెయిన్ వాటర్ లైన్ కనెక్షన్ వంటి అభివృద్ధి పనులు జరిగాయి. ప్రస్తుతం ఎలాంటి పనులు జరగకపోవడంతో అంత్యక్రియల కోసం వచ్చే వారు ఇక్కట్లకు గురవుతున్నారు. కేవలం ఒక్కటే మరుగుదొడ్డి, స్నానం గది ఉండటంతో వెళ్లిన వారు వచ్చే వరకూ వేచి ఉండాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నూతన కమిటీలో లుకలుకలు?

- శాంతినగర్‌లోని సత్యహరిశ్చంద్ర శ్మశాన వాటిక నూతన కమిటీ ఏర్పాటు ఏడాది పూర్తయినా ఇప్పటి వరకు సమీక్ష సమావేశాలు సైతం నిర్వహించడం లేదని పలువురు కమిటీ సభ్యులు చెప్పుకొస్తున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల కనుసన్నల్లోనే శ్మశాన వాటికకు సంబంధించిన పనులు జరుగుతున్నాయని, తమతో ఎలాంటి పనులపై కూడా చర్చించకపోవడంతో కమిటీలో లుకలుకలు మొదలయ్యాయి. ఇటీవల జరిగిన కమిటీ సమావేశంలో సైతం గొడవలు జరిగినట్లు సమాచారం.

స్పందించని ప్రజాప్రతినిధులు

- శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని పలు మార్లు స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. డివిజన్‌లో అనేక అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నా శ్మశాన వాటికపై దృష్టి సారించకపోవడం దారుణమంటున్నారు. ప్రస్తుత కమిటీ సభ్యులు సమన్వయంతో ఉంటూ ఉన్నతాధికారులతో చర్చించి శ్మశాన వాటికను అభివృద్ధి పర్చాలని కోరుతున్నారు.



సమాధుల మధ్య పేరుకుపోయిన చెత్తా చెదారం

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం



రసూల్‌పురా: అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యమని కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు బి. ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం మూడవ వార్డు పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో కంటి వెలుగు కార్యక్రమంపై వైద్యులు, ఆశావర్కర్లు, రిసోర్స్ పర్సన్స్‌తో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగు ద్వారా ఉచిత కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సలతో పాటు అద్దాలను పంపిణీ చేస్తారన్నారు. బాలంరాయిలోని కమ్యూనిటీ హాల్, కార్ఖాన, సిక్‌విలేజ్, మడ్‌ఫోర్ట్‌ల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మహేష్, సురేష్, సాయి కిరణ్ స్థానికులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ..

అడ్డగుట్ట: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ యూసీడీ విభాగం కమ్యూనిటీ అధికారిణి లక్ష్మి సూచించారు. అడ్డగుట్ట, తుకారాంగేట్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆమె ఇంటింటికి వెళ్లి కంటి వెలుగుపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. నేటి (గురువారం) నుంచి బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీహాల్, బోయబస్తీలోని గంగపుత్ర సంఘం భవనంలో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుందని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న లక్ష్మి

రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ఎన్టీఆర్

సనత్‌నగర్: తెలుగు జాతికి ఒక అన్నగా సేవలందించిన ఎన్టీఆర్, సూర్య చంద్రులు ఉన్నంత వరకు చిరస్థాయిగా నిలిచిపోతారని నటుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని ప్రతియేటా ఎన్టీఆర్ అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి సతీష్ ఆధ్వర్యంలో జరిగే ఎన్టీఆర్ అమరజ్యోతి ర్యాలీ బుధవారం ఘనంగా నిర్వహించారు. అంతకముందు నందమూరి సుహాసిని, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌లతో కలిసి బాలకృష్ణ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలుగు వారి ఖ్యాతి విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని సినీ రంగంలో ఆయన చేసిన ప్రతి పాత్రకు జీవం పోశారన్నారు. రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. తెలంగాణలో పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేసి బడుగు బలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యమిచ్చి గొప్ప నాయకుడిగా కీర్తించారు. రసూల్‌పురా చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి ప్రారంభమైన అమరజ్యోతి ర్యాలీ ఎన్టీఆర్ ఘాట్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో యువ నేత కాసాని వీరేష్‌ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జుననాయుడు, ముప్పిడి గోపాల్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అడ్డగుట్ట, తుకారాంగేట్‌లో ..

అడ్డగుట్ట: అడ్డగుట్ట, తుకారాంగేట్‌లో బుధవారం నిర్వహించిన మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ వర్ధంతిలో సికింద్రాబాద్ ఇన్‌చార్జ్ వల్లారపు శ్రీనివాస్ పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు కాత విజయ్‌కుమార్, గణేష్, శ్రీను, బాలాజీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న బాలకృష్ణ, నందమూరి సుహాసిని, కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్

జేబీఎస్ వద్ద ..

కంటోన్మెంట్: తెలుగు జాతికి ఎన్టీఆర్ చేసిన సేవలు మరువలేనివని టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ అధ్యక్షుడు అశోక్ కుమార్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గ టీడీపీ నేతల ఆధ్వర్యంలో బుధవారం జేబీఎస్ వద్ద జనగాం నర్సింగ్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్టీఆర్ హయాంలో ఎస్సీ ఎస్టీ బీసీ అణగారిన వర్గాలకు పెద్దపీట వేశారని రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నర్సింగ్ రావు, కార్యదర్శి మధుసూదన్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో అనురాధ, శ్రీనివాస్ మహేశ్, రవీందర్ పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందుబాటులోకి రావాలి

కంటోన్మెంట్: నాణ్యమైన వైద్యసేవలు పేదలకు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్పీఎఫ్ డీజీపీ ఉమేశ్ షరాఫ్ అన్నారు. హర్యానా నాగరిక్ సమాజ్ (హెచ్‌ఎన్‌ఎస్) ఆధ్వర్యంలో కంటోన్మెంట్ బాలాజీ కో–ఆపరేటివ్ సొసైటీ ఆవరణలో నిర్మించబోయే నూతన చికిత్సాలయ్‌కు బుధవారం బోర్డు మాజీ ఉపాధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు పాండుయాదవ్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక సేవా దృక్పథంతో హెచ్‌ఎన్‌ఎస్ చేపట్టిన కార్యక్రమాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ముఖ్యంగా తలసీమియా బాధితుల కోసం ఉచిత రక్తదాన శిబిరాలతో పాటు సాధారణ చార్జీలకే డయాలసిస్ వంటి సేవలు అందించేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎన్‌ఎస్ అధ్యక్షులు పురుషోత్తమ్ అగర్వాల్, ఉపాధ్యక్షులు సుశీల్ కుమార్ అగర్వాల్, ప్రధాన కార్యదర్శి దీపక్, సంయుక్త కార్యదర్శి సందీప్ మిట్టల్, కోశాధికారి నారాయణ్ చౌదరి పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఉమేశ్ షరాఫ్, మహేశ్వర్ రెడ్డి, పాండుయాదవ్

ఇన్‌ఫెక్షన్ల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికలు



ఐసీయూలను పరిశీలిస్తున్న రాజారావు

గాంధీఆస్పత్రి: గాంధీ ప్రాంగణంలో ఇన్‌ఫెక్షన్లను నియంత్రించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు తెలిపారు. ఆస్పత్రి అధికారులు, పాలనయంత్రాంగంతో కలిసి బుధవారం ఆయా విభాగాల్లోని ఆపరేషన్ థియేటర్లు, అత్యవసర విభాగాల్లో పర్యటించి సలహాలు, సూచనలు చేశారు. ఆస్పత్రుల్లో ఇన్‌ఫెక్షన్లను నియంత్రిస్తే రోగులకు త్వరితగతిన స్వస్థత చేకూరుతుందన్నారు. సర్జరీలకు వినియోగించే వైద్యపరికరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అత్యవసర విభాగాల్లోకి రోగి సహాయకులను అనుమతించరాదని ఆదేశించారు.

స్క్రబ్ సూట్‌ల నిషేధం..

ఆపరేషన్ థియేటర్లు, ఎమర్జెన్సీ విభాగాల్లో విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది ధరించే దుస్తులు (స్క్రబ్ సూట్)తో ఆస్పత్రి ప్రాంగణంలో తిరగడాన్ని నిషేధించినట్లు రాజారావు వివరించారు. కొంతమంది స్క్రబ్‌సూట్‌లు ధరించి ఇంటి నుంచి ప్రయాణం చేసి ఆస్పత్రికి వచ్చి విధులు నిర్వహించడంతో బయట ఉన్న ఇన్‌ఫెక్షన్లు ఆపరేషన్ థియేటర్లు, అత్యవసర విభాగాల్లోకి చేరుతున్నట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. స్క్రబ్ సూట్‌లు ధరించి ఆపరేషన్ థియేటర్, ఐసీయుల్లో విధులు నిర్వహించాలని, విధి నిర్వహణ అనంతరం సాధారణ దుస్తులు ధరించాలని, స్క్రబ్ సూట్లు వేసుకుని బహిరంగ ప్రదేశాలు, ఆస్పత్రి ప్రాంగణాల్లో తిరగరాదని, ఈ మేరకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ–1 జయకృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ మంగమ్మ, ఆర్‌ఎంఓ రాము, ఓటీ సిస్టర్ సునీత, ఆయా విభాగాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వెండర్ మృతి



సికింద్రాబాద్: వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారిపడి రైల్వే కాంట్రాక్ట్ వెండర్ మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు చెందిన బి.శివశంకర్ (20) ఉపాధి కోసం నగరానికి వచ్చి రైలులో క్యాంటీన్ కాంట్రాక్ట్ వెండర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున కాకినాడ ఎక్స్‌ప్రెస్ రైలులో విధులు నిర్వహిస్తున్న శివశంకర్ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య..



సికింద్రాబాద్: రైలుకింద పడి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం... సికింద్రాబాద్–లాలాగూడ రైల్వేస్టేషన్ల మధ్య మృతదేహం ఉన్నట్టు సమాచారం అందుకున్న ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులకు మృతుడి వివరాలు లభించలేదు. ప్రమాదం జరిగిన తీరును బట్టి వృద్ధుడు ఉద్దేశపూర్వకంగా రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

ట్రాఫిక్ పోలీసుల సేవలు మరువలేనివి



పోలీసులను సన్మానిస్తున్న బ్రహ్మకుమారీలు

కంటోన్మెంట్: కరోనా విపత్కర సమయంలో ట్రాఫిక్ పోలీసులు అందించిన సేవలు మరువలేనివని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం మారేడుపల్లి సేవా కేంద్రం ఇన్‌చార్జ్ మంజు దీదీ అన్నారు. బుధవారం మారేడుపల్లి కేంద్రంలో బేగంపేట ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ పరిధిలో పనిచేసే పోలీసులతో పాటు ఏసీపీ శంకర్ రాజును సన్మానించారు. నిత్యం విధి నిర్వహణలో ఒత్తిడికి గురయ్యే ట్రాఫిక్ పోలీసులు మెడిటేషన్ చేయాలని దీదీ మంజు సూచించారు. అనంతరం దీదీ సునీత ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులకు ప్రత్యేకంగా మెడిటేషన శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో దీదీ బిందు, రంజన్ భాయ్, వెంకటసుబ్బయ్య, బీకే సుహాస్ పాల్గొన్నారు.

‘ముకర్రమ్‌జాకు నివాళి అర్పించే అర్హత సీఎంకు లేదు’



మాట్లాడుతున్న గాలి వినోద్‌కుమార్

లాలాపేట: నిజాం ఆస్తులను కొల్లగొట్టిన సీఎం కేసీఆర్‌కు నిజాం మనవడు ముకర్రమ్‌జాకు నివాళ్లు అర్పించే నైతిక అర్హత లేదని దక్షిణ భారత సమితి కన్వీనర్ ప్రొ. గాలి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన ముకర్రమ్‌జా చిత్రపటానికి నివాళి అర్పించిన అనంతరం మాట్లాడారు. స్థానిక దక్కన్ ప్రాంత పాలకుడైన నిజాం నవాబు ప్రపంచం గర్వించే ఉస్మానియా విశ్వవిద్యాలయం వంటి విద్యా, వైజ్ఞానిక సంస్థలను స్థాపించారని కొనియాడారు. ప్రపంచ మేధావి అయిన డా. అంబేద్కర్ మేధస్సును గ్రహించి ఆర్థిక సహాయం అందించి, గౌరవ డాక్టరేట్‌ను ఇచ్చిన ఘనత నిజాం నవాబుకే దక్కుతుందన్నారు. ముకర్రమ్‌జా బతికిఉన్నప్పుడు ఆయనను పట్టించుకోకుండా, రజాకార్ల వారసత్వాన్ని కొనసాగిస్తూ కేసీఆర్, ఓవైసీ కుటుంబాలు వేల కోట్లు సంపాదించుకున్నారని ఆరోపించారు. అధికారిక లాంఛనాలతో అంతిమయాత్ర చేసినంత మాత్రాన నిజాం కుటుంబానికి మేలు చేసినట్లు కాదని ఆయన విమర్శించారు.

7వ వేతన సంఘం సిఫార్సులను అమలు చేయాలి

కవాడిగూడ: ఏడవ వేతన సంఘం సిఫార్సుల మేరకు 1–1–2017 నుంచి పెన్షన్ రివిజన్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా బీఎస్‌ఎన్‌ఎల్, ఆలిండియా రీజినల్ బీఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, పీఅండ్‌టీ ఏఎఫ్‌ఎస్ ఆర్‌ఓఎల ఆలిండియా యూనియన్ పిలుపు మేరకు బుధవారం కవాడిగూడలోని టెలిఫోన్ ఎక్ఛేంజ్ ఆవరణలోని కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ కార్యాలయం ఎదుట వందలాది మంది పెన్షనర్లు ధర్నా నిర్వహించారు. పెన్షనర్ల సంఘాల పిలుపు మేరకు రెండోరోజు ధర్నా కార్యక్రమాన్ని నిరర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సర్కిల్ అధ్యక్షుడు ఎం. గోప రాజు, సర్కిల్‌కార్యదర్శి జి. ఉపేందర్, సీక్యూహెచ్ కార్యనిర్వాహక కార్యదర్శి ఏవీ సుధాకర్ రావు మాట్లాడుతూ... 7 వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం పెన్షన్ రివిజన్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఫిట్‌మెంట్‌ను ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కే. జయరామ్, కే దక్షిణ మూర్తి, ఎఎస్ జనార్దన్, ఎన్ కోటేశ్వర్‌రావు, పి. వెంకటేశ్వర్లు, ఎస్ నర్సింగరావు, ఎం. మధు తదితరులు పాల్గొన్నారు.

9 కేంద్రాలు.. రోజూ 900 మందికి పరీక్షలు



ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న డిప్యూటీ మేయర్



అవగాహన ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఈ నెల19 నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణ కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి జీహెచ్‌ఎంసీ మెడికల్ అండ్ హెల్త్, అర్బన్ కమ్యూనిటీ అధికారులు సహాయ సహకారాలు అందిస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 9 కేంద్రాలు ఏర్పాటు చేశారు. రోజుకు ఒక్కో కేంద్రంలో 100 మంది చొప్పున 900 మందికి కంటి పరీక్షలు నిర్వహించే ఏర్పాట్లు చేశారు. కంటి వెలుగు కార్యక్రమం పట్ల ప్రజల్లో అవగాహన కలిగించేందుకు జీహెచ్‌ఎంసీ యూసీడీ, ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించడంతోపాటు రోగులను గుర్తించి పరీక్ష కేంద్రాలకు పంపిచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి ఇతర పరీక్షలు నిర్వహించడం ఆపరేషన్ తేదీని ఖరారు చేయనున్నట్టు వైద్యాధికారి డాక్టర్ సక్కుబాయి తెలిపారు. వయసు భేదం లేకుండా కంటి సమస్యలు ఉన్నట్టు భావిస్తున్న అందరికీ కంటి పరీక్షలు నిర్వహించాలని శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ కోరారు. కంటి వెలుగు పట్ల విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పరీక్షలు అవసరమైన వారికి కేంద్రాలకు పంపించాలన్నారు. సీతాఫల్‌మండి, చిలకలగూడ అర్బన్ కేంద్రాలను డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ప్రారంభించనున్నారు.

ఏర్పాట్లపై డిప్యూటీ మేయర్ ఆరా..

- లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలో కంటి వెలుగు నిర్వాహణకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం అధికారులతో కలిసి జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి పరిశీలించారు. లాలాపేటలోని ప్రొ. జయశంకర్ ఇండోర్ స్టేడియం, తార్నాక నాగార్జున నగర్ కమ్యూనిటీ హాల్లో కంటి వెలుగు శిబిరాల్లో ఏర్పాట్లపై వైద్యాధికారులతో చర్చించారు. ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ రవీందర్‌గౌడ్, లాలాపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌశీల్యారాణి, ఇన్‌చార్జి మల్లేష్ పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి..

బన్సీలాల్‌పేట్: రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 వరకు కంటి వెలుగు కోసం ఏర్పాటు చేసిన కమ్యూనిటీహాళ్లు తెరిచి ఉంటాయి. కళ్లను పరీక్షించి ఉచితంగా మందులు, అవసరమైన వారికి అద్దాలు ఇవ్వడంతో పాటు కంటి శస్త్రచికిత్సలు చేస్తారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్లు హేమలత, చీర సుచిత్ర శ్రీకాంత్, కొంతం దీపికా నరేష్ పేర్కొన్నారు.

- బోయిగూడ ఉప్పలమ్మ దేవాలయం సమీపంలోని బాపూజీ కమ్యూనిటీహాల్, హమాల్‌బస్తీలో కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేశారు. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని విక్టోరియాగంజ్ కమ్యూనిటీహాల్‌ను సిద్ధం చేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న రవికిరణ్

ఏర్పాట్ల పరిశీలన

- అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ వివేకానంద కమ్యూనిటీహాల్లో జరుగుతున్న కంటి వెలుగు ఏర్పాట్లను బుధవారం జీహెచ్‌ఎంసీ అధికారులు పరిశీలించారు.వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నేపథ్యంలో అక్కడికొచ్చే ప్రజలు ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు జోనల్ కమిషనర్ రవికిరణ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎంసీ మోహన్‌రెడ్డి, వైద్యాధికారులు వెంటక్, రేవతి మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి పాల్గొన్నారు.